ముత్తారంలో తాగునీరు కలుషితం

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ముత్తారం, ఏప్రిల్ 23: ముత్తారం మండల కేంద్రంలో స్థానిక వాటర్ ట్యాంకు సరఫరా అయ్యే రక్షిత తాగునీరు కలుషితమవుతున్నది. నీటిలో పురుగులతో పాటు దుర్వాసనతో వస్తున్నదని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాగునీటి సరఫరా నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా తాగునీరు కలుషితమవుతున్నదనే విమర్శలు ఉన్నాయి. అటు మిషన్ భగీరథ, ఇటు మానేరు వాగు నుంచి వచ్చే నీటిని ఓకే ట్యాంక్‌లో నింపడంతో కలుషితమవుతున్నదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తాము ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నీటి ట్యాంక్ ను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచాలి

కోల్‌సిటీ, ఏప్రిల్ 23: లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా సంక్షేమాధికారి, స్వీప్ జిల్లా నోడల్ అధికారి రవూఫ్ ఖాన్ రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ కోరారు. ఈమేరకు నగర పాలక సంస్థ కార్యాలయంలో స్థానిక డిగ్రీ కళాశాలలు, మెడికల్ కళాశాల ప్రతినిధులతో మంగళవారం సమావేశమయ్యారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు ప్రాధాన్యతపై ఓటర్లలో అవగాహన పెంచేందుకు వివిధ అంశాల్లో పోటీలు, 2కే రన్ తదితర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎక్కడైతే ఓటు హక్కు ఉంటుందో అదే పోలింగ్ కేంద్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ రోజున విద్యార్థులు స్వచ్ఛందంగా సేవలందించేందుకు సన్నద్ధం కావాలని కోరారు. సమావేశంలో అంగన్‌వాడీ సీడీపీవో స్వరూపరాణి, వైద్య కళాశాల సూపరింటెండెంట్ ఉపేందర్ రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు రాజేశ్, రామకృష్ణ, వివిధ కళాశాలల అధిపతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పుస్తక దినోత్సవం

మంథని రూరల్, ఏప్రిల్23: మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్, ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఆంగ్ల భాష, ప్రపంచ పుస్తక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎండీ తాహిర్ హుస్సేన్ మాట్లాడారు .ఆంగ్ల భాష నేడు అధిక ప్రాముఖ్యతను సంతరించుకున్నదని, ఇంగ్లిష్ నేర్చుకుంటే ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చన్నారు. పుస్తకాలు మంచి మిత్రుడిలాంటివన్నారు. ఈ మధ్య కాలంలో పుస్తకాలను ఉపయోగించడం తగ్గిపోవడం, మొబైల్‌పై ఆధారపడడంతో అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నామని తెలిపారు. అలాగే ఆంగ్ల సబ్జెక్ట్ అధ్యాపకురాలు రజిత ఇంగ్లిష్ ఆవశ్యతను వివరించారు. కార్యక్రమంలోఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ కృష్ణ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ పరిషయ్య, అధ్యాపకులు సతీశ్, అమర్నాథ్, ముకుందం, మానస, బోధనేతర సిబ్బంది శ్రీనివాస్, అశోక్, సుధాకర్, ముజాహిద్, రాజు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా, శ్రీ కుమ్మరి సతీష్ S/o గట్టయ్య, వృత్తి బిజినెస్, వయస్సు 38, నివాసము H.No. 20-3-149, విద్యానగర్, గోదావరిఖని (M), రామగుండం, (D) పెద్దపల్లి, రిజిస్ట్రేషన్ జిల్లా కరీంనగర్, సబ్ జిల్లా పెద్దపల్లి పరిధిలోని పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్ గ్రామకంఠంలోని ఆర్.సి.సి. కప్పు గల ఇంటి నెం. 4-114, విస్తీర్ణము 293.33 చదరపు గజములు, సరియగు 245.26 చదరపు మీటర్ల స్థలములో (20) సంవత్సరముల క్రితం నిర్మించబడిన 464.00 చదరపు అడుగుల ఆర్.సి.సి కప్పు మరియు 40.0 చదరపు అడుగుల ఆర్.సి.సి. టాయిలెట్స్ గల ఇంటికి ప్లాను జత పరిచిన ప్రకారము హద్దులు, రోకల ఈ హద్దులు.

తూర్పు : కె. నగేష్ గారి ఇల్లు
పడమర : డి. నర్సింగం గారి ఇల్లు
ఉత్తరం : 33'-0'' గ్రామపంచాయితి రోడ్
దక్షిణం : సి.సి. రోడ్

కల దానిని యజమాని అయి ఉండి సంపూర్ణ స్వాధీనములో ఉండి నాక్లయింట్ మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచ్ గోదావరిఖని వారి వద్ద తనఖా పెట్టుచున్నారు. కావున ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపణలు కానీ ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన (5) రోజుల లోపల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు: Sd/- పిన్నింటి అశోక్, అడ్వకేట్,
ఇ.నెం.3-7-852/1.వానిలాలపల్లి,కరీంనగర్ సెల్: 9849331558

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

కాంగ్రెస్‌ను నమ్మి మరోసారి మోసపోవద్దు

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్
- జూలపల్లిలో 'కొప్పుల'కు మద్దతుగా మహిళల ప్రతిజ్ఞ..



ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, బీఆర్ఎస్ నాయకులు

జూలపల్లి, ఏప్రిల్ 23 : కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను మరోసారి మోసపోవద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాజీ రఘువీర్‌సింగ్ పేర్కొన్నారు. జూలపల్లిలో మారం తిరుపతియాదవ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించుకుంటామని దాదాపు 2 వందల మంది మహిళలు కలిసి మంగళవారం 'సంకల్ప ప్రతిజ్ఞ' చేశారు. మండలంలోని కుమ్మరికుంటకు చెందిన కొప్పుల ఈశ్వర్‌ను ఎంపీగా గెలిపించుకొని పార్లమెంట్‌కు పంపుతామంటూ నినదించారు. ప్రతి ఒక్కరూ బంధువులు, మిత్రులు, శేయోభిలాషులు, సింగరేణి కార్మికులకు ఫోన్ల ద్వారా సమాచారం ఇచ్చి మెప్పించి, ఒప్పించి ఓటేసేలా కృషి చేస్తామని ప్రతిన బూనారు. ఈ సందర్భంగా రఘువీర్‌సింగ్ మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరిట హామీలిచ్చి అధికారం చేపట్టి ప్రజల్ని మోసం చేసిందని పేర్కొన్నారు. ఆ పార్టీ హామీలను నమ్మితే మరోసారి ప్రజలు మోసపోక తప్పదన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ హక్కులు, వాటాలు, నిధులు రాబట్టడానికి కొప్పుల ఈశ్వర్‌ను ఎంపీగా గెలిపించుకోవాలని వివరించారు. ఇక్కడ తేలుకుంట ఎంపీటీసీ సభ్యుడు కత్తెర్ల శ్రీనివాస్, ధర్మారం మాజీ ఉప సర్పంచ్ ఆవుల లత, యాదవ సంఘం మండలాధ్యక్షుడు దాడి కొంమురయ్య, కేసీఆర్ సేవా దళం మండలాధ్యక్షుడు అమరగాని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పొలవేని సతీశ్, మేర శ్రీనివాస్, మల్లెత్తుల నర్సయ్య, మారం వెంకటరమణ, మల్లెత్తుల కన్కయ్య పాల్గొన్నారు.

వందేళ్ల కాంగ్రెస్‌కు అభ్యర్థులే దొరకడం లేదు

రామగిరి, ఏప్రిల్ 23: వందేళ్ల చరిత్ర అని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీకి మూడు పార్లమెంట్ నియోజక వర్గాల్లో అభ్యర్థులే దొరకడం లేదని బీఆర్ఎస్ మంథని ఎన్నికల ఇన్‌చార్జి పోరుగంటి రమణారావు విమర్శించారు. సెంటిసరీకాలనీలో మంగళవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకి ఏం అర్హత ఉందని ఆయన ప్రశ్నించారు. కొప్పుల ఈశ్వర్ ప్రజల మధ్య ఉండే అనుభవం గల ప్రజా నాయకుని కొనియాడారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను ప్రజలు నమ్మకపోవడంతో కొత్త తరహాలో దేవుళ్ల మీద ఒట్టేసి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను చెప్పిన వంద రోజుల్లో అమలు చేయలేక దేవుళ్లపై ప్రమాణాలెందుకని ప్రశ్నించారు. ఆచరణ సాధ్యం కాని హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిఅధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా అమలు చేస్తారో శ్వేతపత్రంను విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి మూడు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించలేదన్నారు. చందాలు ఎక్కువ ఇచ్చే వారి కొరకు అన్వేషిస్తున్నారని అందులో భాగంగానే పెద్దపల్లి ఎంపీ టికెట్ గడ్డం వంశీకృష్ణకు కేటాయించారన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ హెడ్ క్వార్టర్స్ లోనే గుర్తింపు లేని గడ్డం వంశీ పార్లమెంట్ ఎన్నికల్లో డబ్బు బలంతో గెలిచేందుకు యత్నం చేస్తున్నారన్నారు. కొప్పుల ఈశ్వర్‌ను ప్రజలు అక్కున చేర్చుకొని కేసీఆర్ పాలనకు బలోపేం చేస్తారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శెంకేసి రవీందర్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మాదరవేన కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ పూదరి సత్యం, పట్టణ అధ్యక్షుడు కాపురబోయిన భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ దామెర శ్రీనివాస్ తదితరులున్నారు.

ఈజీఎస్ పనుల సోషల్ ఆడిట్

కమాన్‌పూర్, ఏప్రిల్ 23: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై చేపట్టిన సామాజిక తనిఖీలో భాగంగా అధికారులు మంగళవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. మండలంలో మొత్తం 9 గ్రామాల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024మార్చి వరకు చేపట్టిన పనులపై ఇటీవల సోషల్ ఆడిట్ సభ్యులు సామాజిక తనిఖీ చేపట్టారు. కూలీలకు రూ.1.25 56,185 వేతనాలు చెల్లించారు. రూ.1,68,28,770లతో ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో 46 సీసీ రోడ్లు పనులు చేపట్టారు. పనుల్లో ఏలాంటి అవకతవకలు జరగలేదని డీఆర్‌డీవో రవీందర్ రాథోడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కొంరయ్య, అబుడ్స్‌మెన్ తిమ్మరాజు శరత్, ఏపీడీలు అమృత్ కుమార్, సత్యనారాయణ, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీఓ లావణ్య, ఎంపీవో శేషయ్య సూరితోపాటు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒకరి మృతి

దేవేందర్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్23: ఇప్పలపల్లి శివారులో ద్విచక్రవాహనం అదుపుతప్పి జగ్గయ్యపల్లెకు చెందిన ఉప్పుల దేవేందర్ (33) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్యాల పరిధిలోని జగ్గయ్యపల్లెకు చెందిన దేవేందర్ సోమవారం రాత్రి బైక్‌పై కాల్వశ్రీరాంపూర్ వచ్చి స్వగ్రామానికి వెళుతుండగా ఇప్పలపల్లి శివారులో ప్రధాన రహదారిపై క్రవాహనం అదుపు తప్పి కిందపడగా అక్కడిక్కడే మృతి చెందాడు. రాత్రి సమయంలో ఎవరూ గమనించలేదు. మంగళవారం ఉద యం కూలీ పనులకు వెళ్లేవారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు దేవేందర్ మృతదేహంపై పడి రోదించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఓంకార్‌యాదవ్ తెలిపారు. దేవేందర్ కు భార్య జ్యోతి, కుమారుడు యశ్వంత్ ఉన్నారు.

ఆవుల పట్టివేత

ధర్మారం,ఏప్రిల్23: ఆవులను అక్రమంగా తరలిస్తుండగా జక్కన్నపల్లి గ్రామం వద్ద మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జక్కన్నపల్లి వద్ద తనిఖీ చేస్తుండగా 5 ఆవులను అక్రమంగా వాహనంలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన మాచెర్ల అంజయ్య, మాచెర్ల సునీల్ జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో నిర్వహిస్తున్న పశువుల సంతలో ఆవులను కొనుగోలు చేసి అశోక్ లేలాండ్ వాహనంలో తరలిస్తున్నారు. బలవంతంగా మూగజీవాలను వాహనంలో కుక్కి వాటికి ఎలాంటి ఆహారం పెట్టకుండా కరీంనగర్‌లో వధించడానికి తీసుకువెళ్తున్నట్లుగా నిర్ధారించారు.అట్టి ఆవులను వాహనంలో నుంచి దించి గోశాలకు అప్పగించి తరలిస్తున్న అంజయ్య, సునీల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన

జూలపల్లి, ఏప్రిల్ 23 : పెద్దాపూర్‌లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువకులు, ఈజీఎస్ కూలీలు, అధికారులు కలిసి ర్యాలీ తీశారు. సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు. డీటీ అబుబాకర్, ఆర్ఐ సదయ్య, నాయకులు తీగల అశోక్, సీపెల్లి అంజయ్య, సంకెండ్ల లక్ష్మణ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

మంథని రూరల్, ఏప్రిల్ 23 : మండలంలోని బిట్టుపల్లి గ్రామానికి చెందిన రైతు కృష్ణ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. రైతు కృష్ణ (36) రోజువారీగా తన పంటను అడవి పందుల నుంచి కాపాడుకునేందుకు పటాకులు పేల్చేందుకు వెళ్తున్న క్రమంలో అడవి పందులకు అమర్చిన విద్యుత్ వైర్లు తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రాధ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. సంఘటన స్థలాన్ని మంథని ఎస్ఐ వెంకటకృష్ణ పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాల్వశ్రీరాంపూర్ : డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

గ్రాడ్యుయేషన్ డేలో పట్టాలతో చిన్నారులు

అలరించిన చిన్నారుల నృత్యాలు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్23: మండలంలోని గంగారం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అమ్మబడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఏర్పడుతున్నాయన్నాయని, రాబోవు విద్యా సంవత్సరంలో మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని హెచ్ఎం ముంజాల హరికృష్ణగౌడ్ తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్, కుమార్ అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేటీఎస్‌లో స్నాతకోత్సవం

రామగిరి, ఏప్రిల్ 23: స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మంగళవారం స్నాతకోత్సవం, స్పోర్ట్స్ డే , రిజల్ట్ డే నిర్వహించారు. యూకేజీ, 5వ తరగతి విద్యార్థులకు స్నాతకోత్సవం చేశారు. జనవరిలో రిపబ్లిక్ డే సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లోని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వార్షిక పరీక్షల ఫలితాల్లో తరగతి వారీగా మొదటి, రెండో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతి రెడ్డి, హెచ్ఎం బర్ల శ్రీనివాస్, డైరెక్టర్లు శ్రీధర్‌బాబు, అనిల్‌కుమార్, రంజిత్ రెడ్డి,విద్యార్థులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ 21 ఏళ్ల ప్రస్థానం

- స్వరాష్ట్ర సాధన.. కార్మికుల సంక్షేమమే ధ్యేయం
- జైలు జీవితానికి వెరవని నాయకులు
- నేడు 'ఖని'లో రాష్ట్ర ప్రతినిధుల సభ

గోదావరిఖని, ఏప్రిల్ 23 : తెలంగాణ రాష్ట్ర సాధన, కార్మికుల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయడమే లక్ష్యంగా 2003 జనవరి 27న గోదావరిఖనిలో ప్రొఫెసర్ జయశంకర్ చేతుల మీదుగా టీబీజీకేఎస్ పురుడు పోసుకున్నది. తర్వాత కార్మికుల పక్షాన నిలస్తూ వారి ఆదరణ పొందింది. సింగరేణిలో నెలకొన్న సంక్షోభం, వివక్ష సమయంలో టీబీజీకేఎస్ ఆవిర్భావం నుంచి కార్మికుల పక్షాన నిలబడింది. యాజమాన్య అనుకూల సంఘాలు, కార్మిక వ్యతిరేక సంఘాల బండారాన్ని కార్మికుల ముందు ఎప్పటికప్పుడు బహిర్గతం చేస్తూ వచ్చింది. కార్మికుల పక్షాన వారి హక్కులు, డిమాండ్లు, కోరికలు నెరవేర్చడం కోసం చిత్తశుద్ధిగా పని చేస్తున్న కార్మికులు అర్థం చేసుకోవడం మొదలైంది. 2003లోనే గుర్తింపు ఎన్నికల్లో ఆర్జీ-2లో టీబీజీకేఎస్‌ను గెలిపించి ప్రాతినిధ్య సంఘంగా కార్మికులు అవకాశం కల్పించారు. 2007లో ఆర్జీ-2, 3తోపాటు మందమర్రిలో కైవసం చేసుకొని సత్తా చాటింది. 2012లో 5 డివిజన్లలో గెలిచి గుర్తింపు సంఘంగా విజయకేతనం ఎగురవేసింది. తిరిగి 2017లో 9 డివిజన్లలో, మరోమారు రాష్ట్ర గుర్తింపు సంఘంగా గెలిచి అనేక హక్కులు సాధించింది.

కార్మికులతో మమేకమైన పోరాటాలు

సింగరేణి ప్రాంతం ఉలిక్కిపడేలా 2003 జూన్ 17న గోదావరిఖని 7ఎల్ఈపీ గనిలో జరిగిన ఘోర ప్రమాదంలో 17 మంది కార్మికులు జల సమాధి అయ్యారు. మరణించిన కార్మిక కుటుంబాలకు ప్రత్యేక ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని, ప్రమాదంపై విచారణ జరిపించాలని గనిపై టీబీజీకేఎస్ నిరసన పోరాటానికి దిగింది. పోలీసుల బెదిరింపులు, హెచ్చరికలను ఖాతరు చేయకుండా సింగరేణి సీఎండీ ఆర్‌హెచ్ ఖ్వాజా, అప్పటి సీఎం చంద్రబాబు ఎదుట తీవ్ర నిరసన తెలిపింది. ప్రత్యేక ఎక్స్‌గ్రేషియా ఇవ్వకుండా ఇక్కడినుంచి కదలనివ్వబోమని టీబీజీకేఎస్ నాయకులు అప్పటి సీఎం కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యుల కోపాన్ని, టీబీజీకేఎస్ ఆందోళనను గమనించిన ప్రభుత్వం యాజమాన్యం దిగివచ్చి రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడానికి అంగీకరించింది. నాయకులు మిరియాల రాజిరెడ్డి, నూనె కొంరయ్యతోపాటు మరో 12 మందిపై కేసు నమోదైంది. అరెస్టు చేసి జైలుకు తరలించారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొనడం వల్ల ఎస్మా చట్టాన్ని ప్రయోగించి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను అణచివేయడానికి కార్మిక నాయకులను జైలుపాలు చేశారు.

2003 అక్టోబర్ 16న గోదావరిఖని 8ఏ గనిలో పైకప్పు కూలి పది మంది కార్మికులు చనిపోయారు. 2002లో 8వ గనిలో ఎల్‌హెచ్‌డీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ గని పైకప్పు కూలిన ప్రమాదంలో సజీవ సమాధి అయ్యాడు. ఆయన మృతదేహాన్ని కూడా బయటకు తీసుకురాలేకపోయారు. ఈ రెండు ప్రమాదాల్లో కూడా కార్మిక కుటుంబాలకు ప్రత్యేక ఎక్స్‌గ్రేషియా కూడా ఇప్పించిన ఘనత టీబీజీకేఎస్‌దే.

సాధించిన డిమాండ్లు

- డిపెండెంట్ ఉద్యోగం చేపట్టి కార్మికుల పిల్లలకు అదే డివిజన్‌లో పోస్టింగ్ ఇచ్చే విధంగా ఒప్పించి కార్మికులు డిస్మిస్ కాకుండా కాపాడింది.
- ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో కీలకమైన 35 రోజుల సమ్మె పోరాటాన్ని కొనసాగించింది.
- మరో 7 రోజులు సింగరేణి కార్మికులు రాష్ట్ర సాధన సందర్భంగా సమ్మె చేశారు.
- బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో ఏర్పడిన తర్వాత సకల జనుల సమ్మె కాలపు వేతనాలు ఇప్పించింది.
- తెలంగాణ ఇంక్రిమెంట్ ఇప్పించింది.
- మహిళలకు ఉద్యోగాలు ఇప్పించింది.
- డిపెండెంట్ ఉద్యోగాల ప్రక్రియను ప్రారంభించింది.
- కార్మికులు, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందజేలా చేసింది.
- సింగరేణి కల్పించిన గృహాల్లో నివసించే కార్మికులకు ఉచిత విద్యుత్, ఏసీ వసతి
- ఐఐటీ, ఐఐఎంలలో చదివే కార్మికుల పిల్లలకు చెల్లించిన ఫీజు మొత్తంను కార్మికులకు చెల్లించే విధంగా ఒప్పందం
- సొంత గృహం నిర్మించుకున్న కార్మికులు బ్యాంకు ద్వారా పొందిన రూ.10 లక్షలపై వడ్డీని యాజమాన్యం చెల్లించేలా ఒప్పందం
- గని ప్రమాదంలో మెడికల్ అన్‌ఫిట్, విధి నిర్వహణలో మృతి చెందిన కార్మిక కుటుంబంలో ఉద్యోగం చేయడానికి అనాసక్తి ఉంటే రూ.25 లక్షలు బాధిత కుటుంబాలకు చెల్లించేలా ఒప్పందం
- గని ప్రమాదంలో లేదా ఇతర ఏ కారణం చేతనైనా మరణిస్తే కుటుంబ సభ్యులకు రూ.లక్షా 75 వేలు మాత్రమే చెల్లించేవారు. దానిని రూ.20 లక్షలకు పెంచేలా చేసింది.

చెక్ పోస్ట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

మంథని రూరల్, ఏప్రిల్ 23: మండలంలోని ఎక్లాస్‌పూర్ చెక్ పోస్టును అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, మంథని ఆర్డీవో హనుమానాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెక్ పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం చూపితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి 8గంటలకు ఒక టీం చొప్పున మొత్తం మూడు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. చెక్ పోస్టు సిబ్బంది జిల్లా సరిహద్దు నుంచి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. రూ. 50వేల కంటే ఎక్కువగా నగదు ఉంటే సీజ్ చేసి, నగదుకు రసీదు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. రూ. 10 లక్షల నగదు కంటే ఎక్కువ నగదు లభ్యమైతే ఇన్‌కంట్యాక్స్ డిపార్ట్‌మెంట్ వారికి సదరు నగదును అందజేసి కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

నగదు పట్టివేత

ధర్మారం,ఏప్రిల్23: జక్కన్నపల్లి వద్ద పోలీసులు నిర్వహించిన తనఖీలలో ఎలాంటి ఆధారం లేని సొమ్ము పట్టుపడింది.పార్లమెంట్ ఎన్నికల సంద ర్భంగా ఎస్ఐ టీ సత్యనారాయణ, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కిషోర్ ఆధ్వర్యంలో కరీంనగర్-రాయపట్నం రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. కరీంనగర్ మండలం చామనపల్లికి చెందిన దొమ్మట రాములు వ్యక్తి వద్ద ఎలాంటి ధ్రువ పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.98,500 నగదును స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

పాలకుర్తి, ఏప్రిల్23: పాలకుర్తి మండలం వేంనూర్‌లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్)జే అరుణశ్రీ పరిశీలించారు. తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీవో శశికళతో కలిసి వేంనూర్ చెక్‌పోస్టు వద్ద సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు.

వ్యాపారి ఆత్మహత్య

ధర్మారం,ఏప్రిల్23: ధర్మారం మండలం నంది మేడారం గ్రామానికి చెందిన బట్టల వ్యాపారి లైశెట్టి శంకరయ్య (55) మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. శంకరయ్య ధర్మారం మండల కేంద్రంలో క్లాత్ స్టోర్ దుకాణం నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. కాగా శంకరయ్య గ్రామ శివారులోని ఓ రైతు మామిడి తోటలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శంకరయ్య మరణా నికి గల కారణాలు తెలియరాలేదు. సంఘ టనా స్థలానికి ఏఎస్ఐ ఎండీ సాబీర్ సం ర్శించి వివరాలు సేకరించి మృత దేహాన్ని కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన దవాఖా నకు పంపించారు. కాగా మృతుడి కుటుంబం నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక ఎస్ఐ టీ సత్యనారాయణ తెలిపారు.

ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలి

అంతర్గాం, ఏప్రిల్ 23: కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని మద్దతు ధరకు వెంటనే కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్ అధికారులను ఆదేశించారు. బసంత్‌నగర్, అంతర్గాం మండలం గోలివాడలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. సరిపడా టార్పాలిన్లు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. ధాన్యం లోడ్ చేసుకునే మిల్లర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యం కోత పెట్టవద్దని ఆదేశించారు. ఇక్కడ సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, అ